క్లుప్తంగా

పిల్లల ఆరోగ్యానికి పౌష్టికాహారం పంపిణీ

సీడీపీఓ జయ



వేయింగ్ మిషన్లను పంపిణీ చేస్తున్న సీడీపీఓ జయ

హుస్నాబాద్‌రూరల్: పిల్లల బరువు చూసి పౌష్టికాహారం అందించాలని సీడీపీఓ జయ అన్నారు. శనివారం హుస్నాబాద్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కోహెడ, బెజ్జంకి, అక్కన్నపేట, హుస్నాబాద్ మండలాల అంగన్‌వాడీ ఆయాలకు వేయింగ్ మిషన్లు, శారీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకొని పిల్లలు బయటకు వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పిల్లల ఆరోగ్య పరిరక్షణకు ప్రతీ నెల వారి బరువు చూడటంతోపాటు పౌష్టికాహారం అందించాలని సూచించారు.

కొండపోచమ్మ హుండీ ఆదాయం రూ.7.48 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండపోచమ్మ ఆలయం హుండీని దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. 50 రోజులకు సంబంధించి నగదు రూ.7,47,890, బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, ఆలయ సిబ్బంది వెంకట్‌రెడ్డి, కనకయ్య, చిన్నా, సుధాకర్, చందు, లక్ష్మణ్, కొండయ్య, తిరుపతి, హరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఇంజనీరింగ్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, వాటర్ సప్లయ్ సిబ్బందితో తాగునీటిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది ప్రతీ ఇంటికి వెళ్లి తాగునీరు సరఫరా అవుతుందో లేదో చూడాలన్నారు. ప్రజలు నీటిని వృథా చేయకుండా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, ఏఈ సాయిప్రణీత్, తదితరులు పాల్గొన్నారు.

భక్తుల దహార్తి తీరేనా



మూతపడిన వాటర్ ప్లాంట్

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చేందుకు 2019లో భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి రూ.8 లక్షల వ్యయంతో ఆలయ పరిసరాలలో వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేశారు. ఆలయ అధికారులు పట్టించుకోకపోవడంతో మూత పడింది. కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత మళ్లీ వాటర్ ప్లాంట్‌కు మరమ్మతులు చేసి ప్రారంభించారు. రెండు రోజులు మాత్రమే పనిచేసింది. మళ్లీ పాడవటంతో ప్లాంట్ మూతపడింది. దాహం తీర్చుకునేందుకు భక్తులు లీటరు నీటిని రూ.10 నుంచి రూ.15లకు కొనుగోలు చేస్తున్నారు. ఆలయ అధికారులు స్పందించి వాటర్ ప్లాంట్ ప్రారంభించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

కొమురవెల్లి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా మహాదేవుని శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గాంధీభవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. శనివారం నూతన అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

నిర్మాణ దశలోనే శిథిలం

- ఎనిమిదేళ్ల క్రితం మినీ గోదాం నిర్మాణం ప్రారంభం
- నిధుల కొరతతో నిలిచిన వైనం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- చర్యలు చేపట్టాలని రైతుల వినతి



ఎల్లారెడ్డిపేటలో అసంపూర్తిగా ఉన్న మినీ గోదాం

ధాన్యం ఆరబోసుకోవడానికి ప్లాట్‌ఫాం, నిల్వ చేసుకోవడానికి మినీ గోదాం నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గోడల వరకు నిర్మించి వదిలేశాడు. ఇలా ఎనిమిదేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరింది. గోదాం నిర్మాణానికి సొంత శాఖ నుంచి నిధులు మంజూరైన ఆశాఖ అధికారులకు తెలియకపోవడం విశేషం.

తొగుట(దుబ్బాక): మండలంలోని ఎల్లారెడ్డిపేటలో ఎనిమిదేళ్ల క్రితం మినీ గోదాం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నిధుల కొరతతో నిర్మాణం నిలిచిపోయింది. గోదాం అందుబాటులో వస్తుందని ఆశించిన రైతులకు నిరాశే మిగిలింది. నిర్మాణం కూడా శిథిలావస్థకు చేరింది. విశేషమేమిటంటే సాగునీటి పారుదల శాఖ నిధులతో గోదాం నిర్మిస్తున్న విషయం ఆ శాఖ అధికారులకు తెలియకపోవడం. మినీ గోదాం నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయం సంబంధిత శాఖ అధికారిని సమాచారం కోసం సాక్షి ఫోన్ చేయగా నిజమా మా శాఖ నిధులతో నిర్మాణం చేపట్టారా అంటూ ఆశ్చర్య పోవడం గమనార్హం. 2013లో నాటి దుబ్బాక ఎమ్మెల్యే చెరుకు ముత్యంరెడ్డి కృషితో గోదాం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. సాగునీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ ద్వారా ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేసింది. మండలంలో ఎక్కడా సరిపడా ప్రభుత్వ స్థలం లేక ఎల్లారెడ్డిపేటలో నిర్మించేందుకు నిర్ణయించారు. అంతేగాక గ్రామ సర్పంచ్ అనిత చొరవ తీసుకుని గోదాం నిర్మాణానికి స్థలం సేకరించారు. తర్వాత జరిగిన ఎన్నికల్లో ముత్యంరెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోగా, దుబ్బాక ఎమ్మెల్యేగా గెలుపొందిన సోలిపేట రామలింగారెడ్డి గోదాం నిర్మాణానికి 2016 ఏప్రిల్ 30వ తేదీన శంకుస్థాపన చేశారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ గోడల వరకు నిర్మించి బిల్లులు తీసుకున్నట్టు సమాచారం. తర్వాత ఏమి జరిగిందో కానీ గోదాం నిర్మాణం నిలిచిపోయింది. ఎనిమిదేళ్లు గడుస్తున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. ప్రభుత్వం ఏటా ఐకేపీ ద్వారా వర్షాకాలం, యాసంగిలో వందల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఇలా కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ప్రైవేటు గదిని అద్దెకు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ధాన్యాన్ని రోడ్డుపైనే తూకం వేయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షానికి ధాన్యం కొట్టుకుపోయిన సందర్భాలున్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి మినీ గోదాం, ప్లాట్‌ఫాంల నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

గోదాం నిర్మించాలి

గ్రామంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు సరైన స్థలం లేదు. దీంతో ధాన్యం తెచ్చి రోడ్డుపై ఆరబెట్టాక కొనుగోలు నిర్వాహకులు అక్కడే తూకం వేస్తుంటారు. రోడ్డుపైనే కొనుగోళ్లు జరుగుతున్న క్రమంలో అకాల వర్షం కురిసి ధాన్యం కొట్టుకుపోయిన సందర్భాలున్నాయి. ధాన్యం పోసేందుకు సరైన స్థలం లేకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే గోదాం నిర్మాణానికి చర్యలు చేపట్టాలి.

– లక్ష్మణ్, రైతు, ఎల్లారెడ్డిపేట

మా శాఖ నిధులతో నిర్మిస్తున్నట్లు తెలియదు

సాగునీటి పారుదల శాఖ నిధులతో ఎల్లారెడ్డిపేటలో మినీ గోదాం నిర్మిస్తున్నట్లు నాకు తెలియదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– రవి, ఏఈ, నీటిపారుదల శాఖ, తొగుట మండలం

పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బంది

సిద్దిపేటకమాన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాసుపత్రి అవుట్ సోర్సింగ్ సిబ్బంది డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ సిబ్బంది శనివారం విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రిలో 135 మంది అవుట్ సోర్సింగ్‌లో విధులు నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో తమకు కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ విమల థామస్ వెంటనే స్పందించి రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు చెల్లింపులు జరిగేలా చూస్తామని తెలపడంతో ఆందోళన విరమించి విధుల్లో చేరారు.

కాంగ్రెస్ ఎన్నికల పరిశీలకుడిగా మజార్ మాలిక్



మజార్‌మాలిక్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్ పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడిగా కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా మైనార్టీ విభాగం అధ్యక్షుడు మజార్‌మాలిక్‌ను నియమించారని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ శనివారం తెలిపారు. ఈ మేరకు శనివారం టీపీసీసీ తెలంగాణ మైనార్టీ విభాగం ఉత్తర్వులు విడుదల చేసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మెదక్ పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పరిశీలకులను నియమించారన్నారు.

వరి పంట పరిశీలన



వరి పంటను పరిశీలిస్తున్న అధికారులు

సిద్దిపేటరూరల్: తోర్నాల గ్రామ రైతులు సాగుచేస్తున్న సన్నరకం వరి పొలాలను శాస్త్రవేత్తలు సతీష్, వెంకన్న శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డబ్ల్యూజీఎల్ 1246 సన్నరకం వరి పంటను క్షేత్ర స్థాయిలో పరిశీలించామన్నారు. ఈ రకం వరి సుడిదోమ, అగ్గితెగులు, కాండం కుళ్లు తెగుళ్లతోపాటు గింజపై మచ్చలు రాకుండా తట్టుకుంటుందన్నారు. 125 రోజులకే పంట కోతకు వస్తుందని, వానాకాలం, యాసంగికి అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ్, డాక్టర్ పల్లవి, ఏఈఓ వినీల, రైతులు పాల్గొన్నారు.

అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ



హుస్నాబాద్‌లో టిఫిన్ అందజేస్తున్న నాయకులు

బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రెండు ఎంపీ సీట్లతో ప్రారంభమైన బీజేపీ అతి పెద్ద పార్టీగా అవతరించిందన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బైఠక్ టిఫిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుచోట్ల ఇంటి నుంచే టిఫిన్ తెచ్చుకొని బైఠక్ టిఫిన్ కార్యక్రమంలో పాల్గొనాలని పార్టీ ఆదేశించినా బయటి టిఫిన్ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దుబ్బాకలో బీజేపీ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



దుబ్బాకలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్

దుబ్బాక టౌన్: మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేశామని దుబ్బాక ఎంఈఓ జోగు ప్రభుదాస్ అన్నారు. పరీక్ష కేంద్రాలలో ఏర్పాట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక మండలంలో రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. దుబ్బాక జిల్లా పరిషత్ బాలికల ప్రభుత్వ పాఠశాల, లచ్చపేట మోడల్ స్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు.

మిరుదొడ్డి(దుబ్బాక): మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల) ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ జోగు ప్రభుదాసు తెలిపారు. శనివారం మిరుదొడ్డిలోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందు కేంద్రానికి చేరుకోవాలన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు పెంచాలి

ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ భిక్షపతి

హుస్నాబాద్: హుస్నాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కళాశాల అభివృద్ధి కమిటీ సమావేశం ప్రిన్సిపాల్ డాక్టర్ విజయగిరి భిక్షపతి అధ్యక్షతన నిర్వహించారు. కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. కొత్త డిగ్రీ కళాశాల భవనంలో పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పించాల్సి ఉందని, 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ పాత కళాశాలలోనే పూర్తి చేయాలన్నారు. కొత్త కళాశాల సమస్యల పరిష్కారానికి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అడ్మిషన్లు పెంచేందుకు ఇంటింటికి వెళ్లి కళాశాల గురించి అధ్యాపకులు వివరించాలన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అటానమస్ కళాశాలగా గుర్తింపు వచ్చే అర్హత ఉందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకున్న తర్వాత కళాశాల ఎక్కడ కొనసాగించాలనే నిర్ణయం తీసుకుందామని కమిటీ సభ్యులు తీర్మానించారు. సమావేశంలో అభివృద్ధి కమిటీ సభ్యులు కేడం లింగమూర్తి, పందిల్ల శంకర్, మేకల వీరన్న యాదవ్, గంగిశెట్టి గాంధీ, దుండ్ర ఎల్లయ్య, కొండ్లె శరత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కాలంతో కాదు కాంగ్రెస్‌తోనే కరువు

మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్: అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ రైతులను దగా చేస్తోందని, కాలంతో కరువు రాలేదని, కాంగ్రెస్ వల్లే వచ్చిందని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రైతు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌరవెల్లి ప్రాజెక్టుపై వేసిన కేసులను విత్‌డ్రా చేయించి గౌరవెల్లి ప్రాజెక్టును నింపాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌ను డిమాండ్ చేశారు. కాలువలు పూర్తి కాలేదంటున్నారని, ఉన్న కాలువలను నింపి రైతులను ఆదుకోవాలన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, ఎంపీపీలు లకావత్ మానస, మాలోతు లక్ష్మి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష తదితరులు పాల్గొన్నారు.

బీటీ రణదీవేకు నివాళి



రణదీవే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నాయకులు

దుబ్బాకటౌన్: సీఐటీయూ అఖిల భారత వ్యవస్థాపక అధ్యక్షుడు బాలచంద్ర త్రయంబక్ రణదీవే 34 వర్ధంతిని దుబ్బాకలో శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ మాట్లాడుతూ సీఐటీయూ ఆవిర్భవించడానికి రణదీవే చేసిన కృషి మరువలేమన్నారు. కార్మికుల సమస్యలతోపాటు ఆర్థిక, సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటాలు చేశాడని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, రాజు, మహేష్, కృష్ణహరి, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్‌రూరల్: కార్మిక సమస్యల పరిష్కారానికి అలుపెరగని పోరాటం చేసిన వ్యక్తి బీటీ రణదీవే అని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య అన్నారు. సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదీవే 34వ వర్ధంతి సందర్భంగా శనివారం గజ్వేల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రంగారెడ్డి, రవి, మహేందర్‌రెడ్డి, రాజు, లింగం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీని ఓడించి సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పిలుపు ఇచ్చారు. శనివారం మండలంలోని రాంసాగర్ గ్రామంలో తాడూరి రవీందర్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి ఓట్లు దండుకోవాలని చూస్తోందన్నారు. భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు దాసరి ప్రశాంత్, అరుణ్‌కుమార్, తాడూరి మల్లేశం, నీల భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **కార్మికులకు వేతనాలు చెల్లించండి**



మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామ పంచాయతీ కార్మికులు కొన్ని నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చందు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలంటూ శనివారం మిరుదొడ్డి ఎంపీడీఓ గణేష్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని నెలలుగా కార్మికులకు జీతాలు రాక కుటుంబ పోషణ వారికి గగనంగా మారిందన్నారు. అధికారులు స్పందించి కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించేలా కృషి చేయాలన్నారు. క్యాక్రమంలో మండల అధ్యక్షుడు రవి, తదితరులు పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): పారిశుద్ధ్య కార్మికులకు వెంటనే వేతనాలు చెల్లించాలని ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు కాసర్ల యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడంలేదన్నారు. వెంటనే వారికి వేతనాలు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

హుస్నాబాద్‌రూరల్: గ్రామ పంచాయతీలో పని చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోయిని సదన్‌కుమార్ అన్నారు. శనివారం మండల కమిటీ ఆధ్వర్యంలో ఎంపీఓకు వినతి పత్రం అందజేశారు. వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చెంచల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ పర్యటన**



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీ క్లబ్ రీజియన్ చైర్మన్ మాంకాల శ్రీనివాస్ సిద్దిపేట పట్టణ పర్యటన సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో శనివారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో పూజలు చేశారు. ఉగాది పంచాగం ఆవిష్కరించారు. నిరుపేద మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు గంప కృష్ణమూర్తి, పుల్లూరి శివకుమార్, నేతి వేణు కుమార్, జిల్లా కార్యక్రమాల బాధ్యులు మాంకాల నవీన్ కుమార్, మర్యాల వీరేశం, సిద్దయ్య , శ్రీనివాస్, వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణి, ప్రధాన కార్యదర్శి కొండూరి మాధవి, కోశాధికారి చింత రజని పాల్గొన్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరా బంద్**

సిద్దిపేటరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా మండల పరిధిలోని రాఘవాపూర్, పుల్లూరు, చింతమడక, నారాయణరావుపేట మండల పరిధిలో లక్ష్మీదేవిపల్లి, నారాయణరావుపేటలోని 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీధర్ రెడ్డి శనివారం తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించాలని కోరారు.

◆ **గుడుంబా స్వాధీనం**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ శివారు కిసాన్‌నగర్‌లోని కిరాణం దుకాణంలలో శనివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు దుకాణంపై దాడి చేసి 1.25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గుడుంబా అమ్ముతున్న దామెర కనకవ్వపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

◆ **ప్రభుత్వ అసమర్థతతో రైతులకు కష్టాలు**

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతతో రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనా విధానాలతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో వ్యవసాయరంగం కళకళలాడిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రయోగంగా చూపెట్టి కేసీఆర్‌ను అప్రతిష్టపాలు చేయాలనే కుట్రతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎండిన పంటలకు ఎకరాకు రూ. 25 వేల చొప్పున పరిహారం అందించాలన్నారు. యాసంగిలో పండించిన ధాన్యానికి ఇచ్చిన మాట ప్రకారం రూ. 500 బోనస్ చెల్లించాలని, లేనిపక్షంలో ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

◆ **ఉపాధి హామీ పనుల పరిశీలన**

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని కూటిగల్ గ్రామంలో ఉపాధి హామీ పనులను ఎంపీడీవో రామ్మోహన్ శనివారం పరిశీలించారు. ఎండలకు వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున్న ఉపాధి కూలీలు సకాలంలో వచ్చి పనులు చేయాలన్నారు.

◆ **వ్యక్తిపై కేసు నమోదు**

అక్కన్నపేట(హుస్నాబాద్): తాగిన మైకంలో ఇంటిపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తాండ్ర వివేక్ తెలిపారు. శనివారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ గ్రామానికి చెందిన ఎగ్గిడి వెంకటయ్య ఇంటిపై తాగిన మైకంలో ఎగ్గిడి రమేష్ రాళ్ల దాడి చేసి దూషించాడన్నారు. వెంటకయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

◆ **చలివేంద్రం ప్రారంభం**



బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్లలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ ప్రారంభించారు. మార్నింగ్ వాక్ కార్యక్రమంలో గుగ్గిల్ల గ్రామంలోని మురుగు కాల్వలను పరిశీలించారు. ఇటీవల మృతి చెందిన పంచాయతీ కార్మికురాలు సారవ్వ కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన వెంట పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.